క్లుప్తంగా

9 నుంచి హనుమత్ దీక్షాపీఠంలో మండల దీక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీహనుమత్ దీక్షా పీఠంలో ఏప్రిల్ 9వ తేదీ నుంచి స్వామివారి మండల దీక్షలు ప్రారంభం కానున్నాయని పీఠాధిపతి శ్రీ దుర్గా ప్రసాద్‌స్వామిజీ పేర్కొన్నారు. 9వ తేదీ స్వామివారి ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, తమలపాకులతో అర్చన జరుగుతుందని చెప్పారు. అనంతరం పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదుగా భక్తులకు మాలాదారణ చేస్తారన్నారు. ఇక మే 4వ తేదీ నుంచి అర్ధ మండల దీక్షలు, 18వ తేదీ నుంచి ఏకాదశ దినదీక్షలు ప్రారంభం కానున్నాయి.

ఆంజనేయుడికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో స్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ అనంతరం తమలపాకులతో అర్చన జరిగింది. స్వామివారికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి పూజా కార్యక్రమాలను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. సాయంత్రం స్వామివారికి పంచహారతుల సేవ నిర్వహించారు.

ముమ్మరంగా శానిటేషన్ డ్రైవ్




పెనమలూరు: తాడిగడపలో మంగళవారం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ జరిగింది. సచివాలయం-1 పరిధిలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు విస్తృతంగా పర్యటించారు. డ్రెయినేజీల్లో క్రమం తప్పకుండా పూడిక తీయాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త కుండీల్లో ప్రతి రోజు చెత్త తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాడిగడపలో శానిటేషన్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ.13.13 లక్షలు



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని హుండీలను 73 రోజులకుగానూ లెక్కించగా రూ.13,13,870 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని దేవదాయ శాఖాధికారి జీవీ కృష్ణారావు పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ల ఏర్పాటు



రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ అందజేసిన వాటర్ కూలర్లను నిడమానూరు సీడబ్ల్యూసీ గోడౌన్ సెంటర్‌లో మంగళవారం సర్పంచ్ శీలం రంగారావు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని వంశీమోహన్ ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఈ కూలర్లు అందజేశారని తెలిపారు. ఈ కూలర్ల ఏర్పాటుతో గోడౌన్‌లోని కార్మికులతో పాటు ప్రయాణికులకు చల్లటి తాగునీరు అందుతుందన్నారు. అనంతరం సర్పంచ్ రంగారావు ఆధ్వర్యంలో గోడౌన్‌లో పని చేసే కార్మికులందరికీ టవల్స్‌ను ఉచితంగా అందజేశారు. గన్నవరం నియోజకవర్గ ఎలక్షన్స్ ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరరావు, పరిమి విష్ణు, బొగ్గవరపు రాజేంద్ర ప్రసాద్, మండల సోషల్ మీడియా కన్వీనర్ పెనుమాక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మానవ జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది



గాలీబ్ షాహిద్ దర్గాలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆసిఫ్, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రంజాన్ మాసాన్ని ఆచరించటం ద్వారా మానవ జీవితం సుసంపన్నమవుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానిపురంలో ప్రసిద్ధిగాంచిన సూఫీ మత గురువులు, హజ్రత్ సయ్యద్ గాలీబ్ షాహిద్, రెహమతుల్లాయ్ దర్గాలో, మసీదులో మంగళవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమానికి షేక్ ఆసిఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ఇఫ్తార్‌ను ఆసిఫ్ స్వీకరించారు. అనంతరం దర్గాలో ప్రార్థనలను నిర్వహించి, ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్లాంలో రంజాన్‌కు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదన్నారు. సమాజంలో పేదల ఆకలిదప్పికలు తెలుసుకునేందుకు, అట్టడుగు వర్గాలకు అండగా ఉండాలని రంజాన్ సందేశమన్నారు. దేశంలోని సర్వ మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే మైనార్టీలకు అభివృద్ధి సాధ్యమైందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మైనార్టీల సంక్షేమానికి అండగా ఉన్నాయన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి అందించిన నాలుగు శాతం రిజర్వేషన్లు ముస్లిం మైనార్టీల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తే జగన్‌మోహన్‌రెడ్డి ఆ వెలుగులను దేదీప్యమానం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, దర్గా అధ్యక్షుడు ఎండీ ముస్తాక్, దర్గా ప్రముఖులు అబ్దుల్ రెహమాన్, ఇషాక్ అహ్మద్, మహ్మద్ అల్తాఫ్, అబ్దుల్ సత్తార్, బాజీబాబా, బషీరుద్దీన్, అమానుల్లా, అజీజ్, సుభాని, అల్తాఫ్ హుస్సేన్, యునస్, నజీర్, కరీముల్లా, ఇక్బాల్, హుస్సేన్, గౌస్, బేగ్, హుసేన్ షరీఫ్ పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఎంప్లాయీస్ సంఘ్ నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంగ్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్ఎం కార్యాలయం మీదుగా రైల్వే స్టేషన్ వరకు నిరసన ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘ్ ఏజీఎస్ ఎడ్ల నాగేంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో కార్మిక చట్టాలను అణచివేస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానంతో రైల్వే కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ నూతన విధానంతో పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలు మాత్రమే వస్తుందన్నారు. దీంతో వారి కుటుంబం ఎలా మనుగడ సాగిస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైల్వే కార్మికుల న్యాయమైన డిమాండ్ పాత పెన్షన్‌ను కేంద్రం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, కొత్తగా ప్రవేశపెడుతున్న రైళ్ల కనుగుణంగా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ్ డెప్యూటీ సెక్రటరీ రాజబాబు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అల్లం రమేష్, శ్రీను, సీఅండ్‌డబ్ల్యూ బ్రాంచ్ సెక్రటరీ కర్నూలు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్టీఎస్ రోడ్డులో నాకాబందీ



బీఆర్టీఎస్ రోడ్డులో తనిఖీ చేస్తున్న పోలీస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల బృందంలో భాగమైన స్టాటిక్ సర్విలెన్స్ టీమ్ మంగళవారం విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో నాకాబందీ నిర్వహించారు. అధికారి ఎస్.సుకీర్తి నేతృత్వంలో స్టాటిక్ సర్విలెన్స్ టీమ్ వాహనాలను తనిఖీలు చేశారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

రేపు సిద్ధార్థలో ఇన్‌కెండో-2కే24



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీన్ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కామర్స్ చదివే విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ నెల 21వ తేదీ గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో తమ కళాశాల కామర్స్ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో ఇన్‌కెండో-2కే24 పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల తెలిపారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో ఇన్‌కెండో-2కే24 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాజేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కామర్స్ విభాగాధిపతి నారాయణరావుతో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మంగళవారం ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, యాడ్-మాడ్, ఫైనాన్షియల్ అనలిస్ట్, డ్యాన్స్ టూ ట్రిబ్యూట్, మైండ్ ఇట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిస్ ఇన్‌కెండో-2024 పేరుతో ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామన్నారు. కామర్స్ విభాగాధిపతి కోనా నారాయణరావు మాట్లాడుతూ.. గురువారం ఉదయం 9 గంటల నుంచి సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి అతిథిగా ఆదాయపు పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి.సవీష్ వర్మ పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల్లో కామర్స్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతారన్నారు. పోటీల్లో విజేతలకు గురువారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ 1కు చెందిన మహిళకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె కుటుంబ అవసరాల కోసం రూ.30 వేలకు బంగారు నగలు తాకట్టుపెట్టింది. ఈ విషయం ఇంటి ఎదురుగా ఉండే నాగరాజుకు చెప్పింది. దీంతో నాగరాజు సొమ్ము చెల్లించి బంగారం విడిపించి తన వద్ద ఉంచుకున్నాడు. మహిళ తన వద్ద డబ్బు ఉన్నప్పుడు బంగారు తీసుకుంటానని నాగరాజుకు చెప్పింది. అప్పటి నుంచి నాగరాజు ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఫోన్ చేసి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించసాగాడు. నాగరాజు ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయడంతో ఇంటికి వచ్చి బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రాధిక, విజయ

మధురానగర్(విజయవాడసెంట్రల్): హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు మనిషిని ఎలా రక్షించాలో ప్రతి ఒక్కరికి కనీస పరిజ్ఞానం ఉండాలని రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి రాధిక అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. సీపీఆర్ అంటే హృదయ శ్వాస కోసం పునరుజ్జీవన చర్య అని తెలిపారు. సీపీఆర్‌ను ఎలా చేయాలో వాసవ్య మహిళ మండలి ప్రతినిధి కంకణాల విజయతో కలిసి ప్రయోగాత్మకంగా వివరించారు.

రెడ్ క్రాస్ ప్రతినిధులకు ధన్యవాదాలు

ఎన్ఎస్ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ.. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, దీనిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో దీని అవసరం ఎంతో ఉందని కనీస పరిజ్ఞానం తెలిసి ఉండాలని తెలిపారు. సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరం, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రాధికలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

స్థల యజమానురాలిని బెదిరించిన ఘటనపై కేసు

పెనమలూరు: స్థల యజమానురాలిని బెదిరించిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బ్రహ్మంగారి గుడి వద్ద నివాసం ఉంటున్న పి.శేషుమణికి కొంత స్థలం ఉంది. తిరువూరు ప్రభుత్వ కాలేజీ అధ్యాపకుడిగా పని చేస్తున్న కె.మాధవరావు స్థలం తీసుకుని గ్రూప్ హౌస్ నిర్మాణం చేపట్టాడు. ఆ స్థలానికి పక్కనే శేషుమణి స్థలం కూడా ఉండటంతో దారి కోసం తీసుకున్నాడు. దీనికి గాను గ్రూప్‌హౌస్‌లో ఒక ప్లాటు, రూ.18 లక్షలు ఇచ్చే విధంగా హామీ పత్రం రాసి రూ.6 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత గ్రూప్ హౌస్ నిర్మాణం పూర్తి చేయలేదు. ఇంకా ఇవ్వాల్సిన సొమ్ము చెల్లించలేదు. దీంతో బిల్డర్ మాధవరావును అడుగగా అతను, అతని సోదరుడు వాసుదేవరావు కలిసి అసభ్యంగా మాట్లాడి దౌర్జన్యం చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

● ‘బొండా’ గిరి

దేశ వ్యాప్తంగా ఎన్నికల నియామవళి అమలులోకి రావడంతో అన్ని విభాగాల అధికారులు వారి వారి విధుల్లో నిమగ్నమయ్యారు. విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌లోని బొండా ఉమాకు చెందిన టీడీపీ కార్యాలయంలో బ్యానర్, పోస్టర్లను తొలగించేందుకు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆ కార్యాలయానికి వచ్చారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించేది లేదంటూ వాగ్వాదానికి దిగారు. ఇది గమనించిన నగర వాసులు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే గొడవకు దిగడంతో విస్మయం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వీఎంసీ అధికారులను అడ్డుకున్న బీజేపీ నాయకులు

విజయవాడస్పోర్ట్స్: ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలులో భాగంగా బీజేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆ పార్టీ ఫ్లెక్సీలను తొలగించేందుకు వెళ్లిన విజయవాడ మున్సిపల్ అధికారులను బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నిబంధనల ప్రకారం ఫ్లెక్సీలను కచ్చితంగా తొలగించాల్సి ఉందని అధికారులు వివరించినా.. అధికారులతో ఆ పార్టీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గేటు లోపలకు వెళ్లేందుకు ప్రయతించిన అధికారులను అడ్డుకుని వాగ్వావాదానికి దిగారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు

ఇబ్రహీంపట్నం: వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జూపూడిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ స్పృహతప్పి పడిపోయిన ముప్పాల గబ్బర్ (41) స్థానిక నిమ్రా వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేసిన భార్య ముప్పాళ్ల సుజాత పోలీస్ స్టేషన్‌లో అదేరోజు రాత్రి ఫిర్యాదు చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన గబ్బర్ కేతనకొండకు చెందిన సుజాతను గతంలో వివాహం చేసుకున్నాడు. జూపూడి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో స్పృహతప్పి పడిపోయాడు. కంపెనీలో పనిచేస్తున్న మరో వ్యక్తి విషయాన్ని ఫోన్ ద్వారా భార్యకు చేరవేసి నిమ్రా వైద్యశాలకు తరలించాడు. గబ్బర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భర్త నుదిటిపై గాయం ఉండటంతో పోలీసులకు భార్య ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

జి.కొండూరు: తెలంగాణ రాష్ట్రం, ఎర్రుపాలెం నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లతో జి.కొండూరు వైపు వస్తున్న పొట్లదుర్తి సాంబశివరావుని గంగినేని శివారులోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద జి.కొండూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 24 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడప ఎస్‌టీబీఎల్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప ఎస్‌టీబీఎల్ కాలనీ ఎస్ఎల్వీ గార్డెన్స్‌కు అసోసియేషన్ అధ్యక్షుడిగా కోవెలమూడి వెంకట శివనాగ మల్లేశ్వరరావు గత నాలుగేళ్లుగా ఉన్నారు. ఈ నెల 17వ తేదీన అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. సభ్యులు మాట్లాడుతున్న సమయంలో అదే కాలనీకి చెందిన చింతమనేని రాకేష్ కల్పించుకుని అసోసియేషన్ సభ్యులను దుర్భాషలాడటంతో వెంకటశివనాగ మల్లేశ్వరరావు వారించాడు. దీంతో రాకేష్ కర్రతో వెంకటశివనాగ మల్లేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచాడు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరి అంతుచూస్తానని రాకేష్ బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

9 మంది జూదరుల అరెస్ట్

విస్సన్నపేట: విస్సన్నపేట గ్రామం శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9,720 నగదు, ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. పేకాట, కోడి పందేలు ఇతర జూదాల సమాచారం ఇవ్వాలని కోరారు.

వాసవీ సంస్థల సేవలు అపూర్వం



మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవీ సంస్థలు సామాజానికి అందిస్తున్న సేవలు అపూర్వమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. వాసవీ క్లబ్ ఆదర్శ మహిళా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. వాసవీ సంస్థల ద్వారా అట్టడుగు వర్గాలకు చక్కని సేవలందుతున్నాయన్నారు. వాసవీ ఆదర్శ మహిళ సంస్థలో మహిళలు ప్రత్యేకంగా సామాజిక సేవలకు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఆదర్శ మహిళ పేరుతో విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా మహిళలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. రానున్న కాలంలో మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించేందుకు అందరూ అండగా ఉండాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షులు పల్లపోతు మురళీ కృష్ణ మాట్లాడుతూ.. మహిళాభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ క్లబ్ ప్రముఖులు ఆతుకూరి శ్రీదేవి, మువ్వల నిర్మల, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నలందలో ఉత్సాహంగా ఎగ్జిబిట్ - 2024



విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్, టెక్నాలజీని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని ఎఫ్టానిక్స్ సంస్థ హెచ్‌ఆర్‌డీ మేనేజర్ స్ఫూర్తి తెలిపారు. నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎగ్జిబిట్ 2024 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిట్‌కు వివిధ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్ఫూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, లాజికల్ థింకింగ్, ఆలోచనా విధానాన్ని మెరుగుపరుచుకోవడం వంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పరిశోధనలపై దృష్టి సారించి రీసెర్చ్ స్కాలర్స్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి వ్యక్తి జీవితంలో సక్సెస్ సాధించడానికి కష్టపడి పనిచేయడమే ఉత్తమమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీపీటీ, క్విజ్, మ్యాథ్స్ మోడల్, సుడోకు, ఫ్రీ ఫైర్, ట్రెజర్ హంట్, ఫ్యాషన్ వాక్ వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నలంద ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, మ్యాథ్స్ హెచ్‌ఓడీ వి.లక్ష్మి, స్టాటిస్టిక్స్ హెచ్‌ఓడీ పి.రవికుమార్, బి.శేష పవన్, పి.అనీల తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల (ప్రొద్దుటూరు) కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ సి.నాగరాజు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో ‘మిషన్ లెర్నింగ్ అండ్ ఐటీస్ అప్లికేషన్స్’ అంశంపై మంగళవారం ఆ కళాశాల ఆవరణలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నిత్యం మార్పులు అనివార్యమవుతున్నాయన్నారు. తదనుగుణంగా విద్యార్థులు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను, సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. కంప్యూటర్స్ రంగంలో ఆయా అంశాలను తెలుసుకోవటానికి, విశ్లేషణ చేయటానికి అనేక నూతన సాఫ్ట్‌వేర్లు అందుబాటులోకి వచ్చాయని, వాటిని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను వివరించేందుకు సదస్సులను, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటేష్‌కు జీడీఏ ఏపీ సంఘం అభినందనలు



డాక్టర్ వెంకటేష్‌ను అభినందిస్తున్న జీడీఏ ఏపీ సంఘ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల వైద్య విద్య అదనపు సంచాలకులుగా(అడిషనల్ డీఎంఈ)గా పదోన్నతి పొందిన ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్‌కు మంగళవారం గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్(జీడీఏ ఏపీ) సిద్ధార్థ వైద్య కళాశాల శాఖ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్, డాక్టర్ సంపత్‌లు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన సేవలు అందించేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా కృషి చేస్తున్న డాక్టర్ వెంకటేష్‌కు పదోన్నతి రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం వైద్య విద్య అదనపు సంచాలకులుగా పదోన్నతి పొందడంతో పాటు, ఆయనకు ఉన్న అనుభవంతో రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం తమ సంఘ సభ్యులు సైతం రోగులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ దుర్గారాణి, కోశాధికారి డాక్టర్ రత్నబాబు, డాక్టర్ నూరుల్లా, డాక్టర్ అంకిత తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తికి ఘన సత్కారం



రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను సత్కరిస్తున్న న్యాయమూర్తులు

నందిగామ: నందిగామలో మంగళవారం రాత్రి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికతో కలిసి పలువురు న్యాయమూర్తులు ఘనంగా సత్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సత్కరించారు. నూతన కోర్టు భవనాల ప్రాంగణంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు మొక్కలు నాటారు. కోర్టు భవనాలలోని అన్ని గదులను పరిశీలించారు. ముఖ్యంగా కోర్టు భవనాలలో కల్పించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు, పలు కోర్టులకు చెందిన న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ కోర్టు ఏర్పాటు చేయాలి..

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పలు వినతులు చేశారు. పట్టణానికి వచ్చిన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టును కూడా కోర్టు ప్రాంగణాలలో ఏర్పాటు చేయాలని, కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నందిగామలో ఫ్యామిలీ కోర్టు, అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు కూడా ఏర్పాటు చేయాలని కోరినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు తెలిపారు.